క్లుప్తంగా

15న ఆలయ భూమి కౌలు హక్కుల వేలం

నందిగామ టౌన్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములకు టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఫణికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాములూరు, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామ శివారులో ఉన్న 3.67 ఎకరాలకు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే ఈ వేలంలో రైతులు పాల్గొనాలని కోరారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు..

నందిగామ పట్టణంలో సీతారామాంజనేయ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 15న మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో ఫణికుమార్ చెప్పారు. కానుకల లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో శివపార్వతి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆమె కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి లక్ష మల్లెలార్చన



తిరువూరు: స్థానిక రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గోదాదేవీ సమేత శ్రీకృష్ణుడికి, సీతారామ లక్ష్మణులకు విష్ణు సహస్ర నామార్చన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జూలైలో ఏఐటీయూసీ శిక్షణ తరగతులు

నూజివీడు: నూజివీడులో జూలైలో నిర్వహించే ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలు చర్చిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారం, స్కీం వర్కర్ల జీతాల పెంపు వంటి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, నూజివీడు ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. శ్రీను, సహాయ కార్యదర్శి కె. రామ్మూర్తి, హెచ్‌పీ గ్యాస్ యూనియన్ నాయకులు వేణుగోపాలరావు, శ్రీను, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



నూజివీడు: ఇంటి పరిసరాల్లోని మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలని నూజివీడు డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని కోనేరుపేట పట్టణ ప్రాథమి ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి తదితర అనేక రకాల ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు కొలుసు సౌమ్య, సబ్ యూనిట్ అధికారి ఎం. యలమంద, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో పేట

- రోజు రోజుకూ పెరుగుతున్న పరిశ్రమలు
- రక్షణ చర్యలు శూన్యం
- కలుషితమవుతున్న వాతావరణం
- పర్యావరణానికి ముప్పు
- పంటలు, ప్రజలకు నష్టాన్ని కలిగిస్తున్న వైనం



బలుసుపాడు పరిధిలో రంగుమారిన పాలేటినది నీరు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. పట్టణ పరిసర ప్రాంతంలో పుట్టగొడుగుల్లా రోజురోజుకూ పెరిగిపోతున్న పరిశ్రమలు ఈ ప్రాంత ప్రజల మనుగడకు శాపంగా మారాయి. వాటి నుంచి వెలువడే దుమ్ము, ధూళి తదితర విషవాయువులను పీల్చిన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. నేడు అనేక మంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఉదంతాలే ప్రత్యక్ష నిదర్శనాలుగా చాటిచెపుతున్నాయి.

30కి పైగా..

ఉమ్మడి కృష్ణా, నల్గొండ, ఖమ్మం, గుంటూరు జిల్లాల కూడలిగా ఉన్న పేట ప్రాంతంలో సున్నపురాతి నిక్షేపాలు కొన్ని వందల సంవత్సరాలకు సరిపోయే విధంగా ఈ ప్రాంతంలో ఉండటం వల్ల అనేక బారీ స్థాయి సిమెంట్ ఫ్యాక్టరీలు, మినీ ప్లాంట్‌లు నిర్మించారు. కెమికల్ ఫ్యాక్టరీలు, సిమెంట్ సంచుల కొరకు స్పిన్నింగ్ ఫ్యాక్టరీలు, మందుల ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్‌లు, అట్టలు, పేపర్ తయారీ పరిశ్రమలు ఇలా పట్టణానికి ఆనుకుని సుమారు 30 వరకు స్థాపించారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంగా ఉన్న సమయంలోనే ఈ ఫ్యాక్టరీలన్నీ నిర్మించారు. వెనుకబడిన ప్రాంతంగా తెలంగాణలో నిర్మించటం వల్ల అనేక రాయితీలు, సౌకర్యాలు పొందవచ్చనే ఉద్దేశంతో సిమెంట్ ఫ్యాక్టరీలకు అనుబంధంగా ఉన్న కాటన్, సంచుల పరిశ్రమలు, అట్టలు, పేపర్, మందులు, కెమికల్ ఫ్యాక్టరీలు అన్ని దాదాపుగా పాలేటి నదికి ఆనుకుని తెలంగాణ జిల్లా అయిన నల్గొండ పరిధిలోనే స్థాపించారు.



కాలుష్య పొగలు వెళ్లగక్కుతున్న ఓ ఫ్యాక్టరీ

కలుషితమవుతున్న పాలేటి నీరు..

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండి ప్రవహిస్తున్న కృష్ణా నదికి ఉప నది అయిన పాలేటినది దాదాపుగా కనుమరుగయ్యే దశకు వచ్చింది. శతాబ్దాల నుంచి పాలేటి నది తీర ప్రాంత గ్రామాలకు జీవనాధారంగా కొనసాగుతూ వస్తోంది. పరిశ్రమల స్థాపనతో వాటి నుంచి వచ్చే రసాయనాలను పాలేటిలోకి వదిలివేయటంతో పాలేరు కలుషితానికి గురై మత్స్యకారుల జీవనం ప్రశ్నార్థకంగా మారింది. విషతుల్యమైన నీటిలో చేపలు తదితర జలచరాలు మృత్యువాత పడుతున్నాయి.

ఈ గ్రామాల్లో..

తీర గ్రామాలయిన తక్కెళ్లపాడు, గరికపాడు, బలుసుపాడు, అన్నవరం, బూదవాడ, రెడ్డినాయక్‌తండా, కె.అగ్రహారం, జయంతిపురం తదితర గ్రామాల ప్రజలు తాగునీరు పూర్తిగా కలుషితమైంది. నదిలో స్నానాలకు దిగిన వారి చర్మం దురదలు పెడుతూ చర్మవ్యాధులు వస్తున్నాయి. పశువులు కూడా నది నీటిని తాగి అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి.

నిస్సహాయంగా కాలుష్య నియంత్రణ మండలి

పరిశ్రమలలో నుంచి పంటలు, జీవరాసులకు హాని కలిగించే వాయువులు, రసాయనాలు బయటకు రాకుండా నిబంధనలు విధించాల్సిన కాలుష్య నియంత్రణ మండలి చేష్టలుడిగి నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. పగలు కాకుండా అనేక ఫ్యాక్టరీలు రాత్రివేళల్లో కాలుష్యాన్ని బయటకు వదులు తున్నాయి. ఇలాంటి అనేక పరిశ్రమలలో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ కాలుష్యాన్ని నియంత్రించాల్సిన ఆశాఖ అధికారులు కట్టడి చేయాల్సిన పలు పరిశ్రమలను ఏమిచేయలేకపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్తగా నెలకొల్పే ఫ్యాక్టరీలకు కూడా నిరభ్యంతరంగా అనుమతులు ఇస్తున్నారు. తద్వారా అవి తమ లాభాలను చూసుకుంటూ ప్రజాసంక్షేమాన్ని మరచిపోతున్నారు.

గతంలో పాలేటి నీరు



గతంలో పాలేటి నీటినే తాగేవాళ్లం. నేడు ఆనీరు విషపూరితంగా మారిపోయింది. గాలి కూడా కలుషితం కావడం వలన చాలా మంది శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పుడు మినరల్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మైల విజయరాజు, గ్రామస్తుడు, బలుసుపాడు

అధికారులు శ్రద్ధ తీసుకోవాలి..



పాలేటికి ఎగువన ఉన్న ఫ్యాక్టరీ లన్నీ తెలంగాణ రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయి. కనుక తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలలో ఉమ్మడి కృష్ణా, నల్గొండ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశ్రమల కాలుష్యాన్ని పాలేటిలో కలవకుండా చర్యలు తీసుకోవాలి.

–మార్తి నానమ్మ, మాజీ సర్పంచ్, బలుసుపాడు గ్రామం

చర్మవ్యాధులు వస్తున్నాయి



గతంలో అమృత జలాలను అందించిన పాలేరు నేడు పూర్తిగా విషం కక్కుతోంది. కొందరు పారిశ్రామిక వేత్తల స్వార్థం కోసం నదీజలాలను పూర్తిగా కలుషితం చేస్తున్నారు. ఆనీటిలో దిగిన మనుషులు, పశువులకు చర్మవ్యాధులు వస్తున్నాయి.

–మార్కపూడి రవీంద్రబాబు, పద్మావతినగర్, జగ్గయ్యపేట

జగన్‌ను కలిసిన నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్



జగన్‌ను కలిసిన వేల్పుల రవికుమార్

పెనుగంచిప్రోలు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఎన్నికలపై నియోజకవర్గంలో జరిగిన ఫలితాల వివరాలను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. పార్టీకి మళ్లీ మంచిరోజులు వస్తాయని మీ వెంటే మేము ఉంటామని అన్నారు.వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో పెనుగంచిప్రోలు గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఉన్నారు.

పేదలకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): పేద కుటుంబాలకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ వాటర్ ఉండటంతో వాటిని సేవించిన ప్రజలు ఎముకల సంబంధిత వ్యాధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని చెప్పారు. ఈనేపథ్యంలో ప్రతి రోజూ వెయ్యి లీటర్ల మినరల్ వాటర్‌ను పేదలకు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఫ్లోరైడ్ వాటర్ వాడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సంస్థ కార్యదర్శి సుమలత, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో విద్యార్థులకు స్వర్ణ నంది పురస్కారం

జగ్గయ్యపేట అర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 10వ తేదీన ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో ఆదర్శ శాస్త్రీయ నృత్యోత్సవం–2024 నిర్వహించారు. ఈ ఆదర్శ స్వర్ణ నంది పురస్కారం కార్యక్రమంలో జగ్గయ్యపేటకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరిచినట్లు సత్యా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. జగ్గయ్యపేటలోని సత్యా కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచి ఆదర్శ స్వర్ణ నంది పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు సత్యా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ యాజమాన్యం తరఫున ఓగిరాల రామకృష్ణారావు, కూచిపూడి గురువులు కృష్ణవేణి, మానస, లావణ్య, దివ్య అభినందనలు తెలియజేశారు.



స్వర్ణ నంది పురస్కారాలతో పేట డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి పెనుగంచిప్రోలుకు చెందిన బత్తుల రామారావు రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన తన రాజీనామాను పత్రికా ముఖంగా ప్రకటించారు. ఈ సందర్భంగా బత్తుల రామారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీకి తన రాజీనామా లేఖను ఈ మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభానుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్‌లో వారు ఇరువురితోనే తన ప్రయాణం ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు తనకు అన్ని విధాలుగా సహకరించిన పార్టీ నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.



బత్తుల రామారావు (ఫైల్)

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని ఆటో ఢీ కొట్టిన ఘటనపై మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదలకు చెందిన చొప్పవరపు త్రినాథ్ తాపీ పని చేస్తుంటారు. ఈ నెల 9న కే హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో ఢీ త్రినాథ్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఆయన మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రమాద బీమా అందజేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ వి.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కో ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరు చేసింది. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ వి.లీలా చేతుల మీదుగా మృతుడి భార్య వి.సుజాతకు చెక్కును అందజేశారు. సంఘ్ ప్రెసిడెంట్ ఎస్.రామగుప్తా, సొసైటీ సభ్యులు బి.ప్రభాకరబాబు, ఎస్వీఏ మల్లేశ్వరరావు, మహేష్ నాయుడు, రాజారావు పాల్గొన్నారు.

విద్యతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్య అనేది పరీక్షల్లో మార్కుల కోసం కాకుండా యువతలోని విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజర్(ఐపీఈ) మాజీ డీన్ ఎంఎల్.సాయికుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో గ్రూమింగ్ ఫర్ హైరింగ్ అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా తమలో జ్ఞానాన్ని పెంచుకుని తాము మంచి విద్యావంతులుగా మారాలనే ఉద్దేశంతో చదవాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల సదస్సుకు అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

42 వేల పాఠ్య పుస్తకాలు సరఫరా

నూజివీడు: 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. దీనిలో భాగంగా పాఠ్య పుస్తకాలు ఇప్పటికే పట్టణంలో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరుకున్నాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 75 వేల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 42 వేల పాఠ్య పుస్తకాలు ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరాయి. ఇంకా 33 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. వీటిని సెట్ల వారీగా పాఠశాలలకు పంపించేందుకు సీఆర్పీలు సిద్ధం చేస్తున్నారు. 8 నుంచి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని నేటి నుంచి ఆయా పాఠశాలలకు పంపేందుకు ఎంఈఓ–1 ఎం సేవియా ఏర్పాట్లు చేశారు.



ఎస్ఆర్ఆర్ హైస్కూల్లోని స్టాకు పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు

పలు రైళ్లు దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఖాజీపేట–బలార్షా సెక్షన్‌లో నాన్–ఇంటర్ లాక్ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను దారి మళ్లించినట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ తెలిపారు. ఈ నెల 22 నుంచి జూలై 5 వరకు విశాఖపట్నం–న్యూఢిల్లీ (20805/20806), 27, జూలై 4 తేదీల్లో విశాఖపట్నం–గాంధీధామ్(20 803), 23, 30 తేదీల్లో గాంధీధామ్–విశాఖపట్నం (20804), 23, 30 తేదీలలో పూరి–ఓఖా (20819) ఈ నెల 26, జూలై 3 తేదీలలో ఓఖా–పూరి (20820), ఈ నెల 24, 28, జూలై 1, 5 తేదీలలో విశాఖపట్నం–నిజాముద్దీన్ (12803), ఈ నెల 23, 26, 30, జూలై 3 తేదీల్లో నిజాముద్దీన్–విశాఖ (12804) రైళ్లను వయా విజయనగరం, రాయగఢ, టిట్లాగడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ స్టేషన్ మీదుగా దారి మళ్లించామన్నారు.

బ్లాక్ చైన్ టెక్నాలజీపై అవగాహన

కంచికచర్ల: విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆల్గోరాండ్ సంస్థ టెక్నికల్ లీడ్ డాక్టర్ నిఖిల్ వర్మ పేర్కొన్నారు. కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చైన్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ ప్రాముఖ్యత, భవిష్యత్‌లో ప్రయోజనాలు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఆల్గో భారత సంస్థ రీజినల్ అంబాసిడర్ మల్లారెడ్డి ఆకాష్‌రావు మాట్లాడుతూ ప్రముఖ ఎన్‌జీఓ నాస్కామ్ ఈ బ్లాక్ చైన్ సర్టిఫికేషన్ కోర్సును ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికేషన్ కోర్సువలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించవచ్చని తెలిపారు. సదస్సులో కళాశాల సీఈఓ డీ పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్, ఏ అనురాధ, మోహంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నడాక్టర్ నిఖిల్ వర్మ

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్–ఐఐసీటీలో ప్రధాన పరిశోధకులు డాక్టర్ కె.నాగయ్య అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ రంగంలో పరిశోధనలు అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా నాగయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్న తీరు, భవిష్యత్తులో పరిశోధనా రంగంలో రాణించడానికి అవసరమైన మెలకువలను వివరించారు. కళాశాలలో చేస్తున్న పరిశోధనలను తెలుసుకుని, వివిధ ప్రభుత్వ రంగ, ఇతర సంస్థల నుంచి రీసెర్చ్ గ్రాంట్స్ పొందడానికి అవకాశాలను తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఏ.సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగయ్య

దోమకాటు.. పాడికి చేటు

- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- దోమ తెరల వినియోగంతో మేలు

పెనుగంచిప్రోలు: వర్షాలకు పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలవుతున్నాయి. దోమలతో మనుషులే కాదు, మూగజీవాలకూ ఇబ్బందే. దోమకాటు వలన పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. దోమల నుంచి పశువులను కాపాడుకుంటేనే పాడి పశువుల పోషణ ఆశాజనకంగా ఉంటుందని పశువైద్యులు పేర్కొంటున్నారు. పశువుల సంరక్షణకు తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. నియోజకవర్గంలో గేదెలు 10 వేలు, ఆవులు 3 వేల వరకు ఉన్నాయి.

దోమకాటుతో సమస్యలు..

- పాల దిగుబడి తగ్గుతుంది
- మేత సరిగా తినలేవు. ఆకలి మందగిస్తుంది
- పశువులు బలహీనంగా తయారవుతాయి
- పశువులు జ్వరం బారిన పడతాయి. శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది
- సకాలంలో పశువైద్యులకు చూపించకపోతే వాటి ప్రాణానికే ప్రమాదం
- చర్మం మీద దురద వచ్చినప్పుడు పుండ్లు పడతాయి
- దురదలు, ఇతర అలర్జీలకు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి

పాటించాల్సిన జాగ్రత్తలు..

- పశువుల పాక, షెడ్డులోకి దోమలు ప్రవేశించకుండా చూడాలి
- పశువులను షెడ్లు లేదా పాకలో కట్టేసిన తరువాత చుట్టూ దోమ తెరలు కట్టి రంధ్రాలు లేకుండా చూడాలి
- సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టివేసే ముందు వేప ఆకులతో లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి
- పశువుల పాక చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
- పశువులను కట్టేసే ప్రదేశాన్ని సిమెంట్ ఫ్లోరింగ్ చేసుకోవాలి. తద్వారా పశువుల కాళ్ల వద్ద మురుగు, వ్యర్థాలు నిల్వ ఉండవు.
- షెడ్డును ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, శుభ్రమైన నీటితో కడగాలి
- పశువుల వ్యర్థాలు, అవి తిన్న తరువాత మిగిలిన మేత నిల్వ ఉంచకూడదు
- కుడితి తొట్టెల్లో నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రంగా ఉండేలా చూడాలి
- పశువులకు మేత వేసేందుకు గాడి ఎక్కువ లోతులో ఉంచకూడదు
- అరడుగు నుంచి అడుగులోతు, రెండు అడుగుల వెడల్పు మాత్రమే గాడి ఉండేలా చూడాలి.



పెనుగంచిప్రోలులో పశువుల పాక చుట్టూ దోమతెర ఏర్పాటు



షెడ్డుల్లో పాడి గేదెలు

అప్రమత్తంగా ఉండాలి..



వర్షాలకు దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దోమల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం, అలర్జీ, దోమకాటు నుంచి పశువులను సంరక్షించుకోవాలి. లేకపోతే పాలదిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఒక్కోసారి భారీ నష్టం కూడా జరగవచ్చు.

–అనిల్, పశువైద్యాధికారి, పెనుగంచిప్రోలు

• ముళ్లకంప తొలగింపునకు చర్యలు

తిరువూరు: తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ముళ్లకంపలు, పిచ్చిచెట్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ఆదేశించారు. పనులను ఆయన ప్రారంభించారు.